











రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొల్లిపర: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం కొల్లిపర సమీపం కృష్ణానదిలో ఏర్పాటు చేసిన మార్గాన్ని ఆయన స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రైతులు సహకారంతో కృష్ణానదిలో గాలు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కొల్లిపర నుంచి కృష్ణా జిల్లా వెళ్లటానికి అతి దగ్గరగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, నాయకులు కల్లం వీరారెడ్డి, గుదిబండి మణిరెడ్డి, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.


గాలు మార్గాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

తెనాలి: మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాల్లో సభ్యులు భాగస్వాములు కావాలని సంస్థ తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ సూచించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో ఆదివారం మానవత సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డాక్టర్ రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ఈ నెలలో సంస్థ తరఫున చేపట్టిన కార్యక్రమాలను కో–చైర్మన్ డాక్టర్ శారద వివరించారు. కాలేజి అధ్యాపకుల ఉద్యమంలో పనిచేసిన అధ్యాపకుడు తుమ్మల రంగారావు, 97 ఏళ్ల వయసులోనూ క్రమం తప్పని వ్యాయామం చేస్తున్న జొన్నలగడ్డ నారాయణమూర్తి, బాల సాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని, ఆధ్యాత్మిక ప్రవచకురాలు నాగభైరవ గంగా పార్వతిని ఈ సందర్భంగా సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి సందేశంతో ఉన్న మానవత డైరీని డాక్టర్ శారద ఆవిష్కరించారు. కూరపాటి కల్యాణి, టి.శ్రీనివాసబాబు, డీవీ సోమయ్యశాస్త్రి, దుర్గాప్రసాద్, ఓంకార్ ప్రసాద్, ఎస్వీ శర్మ, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం

తైక్వాండోలో పతకాల పంట

తెనాలిఅర్బన్: ఛామ్ ఐటీఎఫ్ నేషనల్ ట్రెడిషినల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెనాలికి చెందిన కేఎస్కే తైక్వాండో అకాడమి విద్యార్థులు ఏడుగురు బంగారు, ఆరుగురు వెండి, ఎనిమిది మంది కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను రేపల్లెలో శనివారం నిర్వహించినట్లు చెప్పారు. ఆదివారం అకాడమిలో క్రీడాకారులకు పతకాలు అందజేశారు. భాస్కరుని శ్రీనివాసరావు, కొత్త రామారావు, కె.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.


విద్యార్థులతో శ్రీనివాసరావు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

తెనాలి: బోసు రోడ్డులోని కాకుమాను శంకరుని సత్రంలో శంకరుని 107వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లోని వందమంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.2 వేల వంతున రూ.2 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. 650 మంది వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. పేదలకు అన్నదానం చేశారు. బాటసారుల సేవ కోసం ధర్మ సత్రాన్ని నెలకొల్పిన ఆధ్యాత్మిక చింతనాపరుడు కాకుమాను శంకరుడు ధన్యజీవి అని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. శంకరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధర్మసత్రం వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు కాకుమాను శరత్‌బాబు, ఈఓ మండెపూడి పానకాలరావు, సిబ్బంది ఎల్.వాసుదేవరెడ్డి, చంద్రం పాల్గొన్నారు.


స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

నూతన సంవత్సర సందడి

తెనాలిఅర్బన్: నూతన సంవత్సర సందడి తెనాలిలో నెలకొంది. ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో కేక్ మేళాలు, స్వీట్లు, గ్రీటింగ్ కార్డులు, వివిధ రంగులు, పూల విక్రయ కేంద్రాలను ఆదివారం ఏర్పాటు చేశారు. కేకుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.


అమ్మకానికి సిద్ధంగా కేకలు


స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

డప్పు కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలిటౌన్: కొలకలూరులోని శుక్రవారం రాత్రి మృతి చెందిన డప్పు కళాకారుడు బీసీపోగు రవిబాబు కుటుంబాన్ని ఆదివారం తెనాలి కళల కాణాచి సభ్యులు పరామర్శించారు. ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సంయుక్త కార్యదర్శి కొండమూడి రమేష్ రవిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్ ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు వారు తెలిపారు. సీనియర్ కళాకారుడు సుద్దపల్లి శరత్‌వెంకయ్య, ఏబీఎం చర్చి పాస్టర్ ఎస్.సురేష్ ఉన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

తెనాలి: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని సంఘ భవనంలో జరిగింది. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. న్యాయవాది మూల్పూరి లక్ష్మీజగదీశ్వరాంబ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రస్తుత అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా కొలసాని వెంకటకోటయ్య, కార్యదర్శిగా ప్రసాదం పూర్ణచంద్రరావు, సంయుక్త కార్యదర్శిగా పుచ్చకాయల కోటిరెడ్డి, కోశాధికారిగా డాక్టర్ నర్రావుల ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులుగా కొరటాల ఈశ్వర్‌చంద్, బొబ్బా వెంకటేశ్వరరావు, అబ్బూరి రామమూర్తి, మహమ్మద్ అజ్గర్ ఆలీ ఎన్నికయ్యారు.

ఆర్యవైశ్యుల పురోగతికి ఎల్లవేళలా సహకారం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: ఆర్యవైశ్య సంఘాలు సంఘీయుల పురోగతికి అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. స్థానిక బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కల్యాణ మండపంలో తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా ఆర్యవైశ్యులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సంఘ పూర్వ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయంగా చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ఆర్యవైశ్య కమిటీ సంఘీయుల అభివృద్ధికి సహకరిస్తూనే సమాజంలోని పేదలకు చేయూతనివ్వాలని సూచించారు. పాలకవర్గ అధ్యక్షుడిగా అచ్యుత సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి భాస్కరుని ప్రసాద్, కోశాధికారి ముప్వల శ్రీనివాసరావు గుప్త, ఇతర కార్యవర్గం ప్రమాణం చేసింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహా సభ నాయకులు సాధు ప్రతాప్, పెనుగొండ వెంకట్రావు, దర్శి కోటేశ్వరరావు, మద్దాళి శేషాచలం, కౌన్సిలర్ గొడవర్తి హరేరామ్ పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం



















